సాక్షి
జోగుళాంబ గద్వాల
సోమవారం । 15 । జనవరి । 2024



ఉత్కంఠ భరితంగా..
ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి.
వివరాలు 10లో ▸



ప్రభోత్సవంకు ముస్తాబు
అచ్చంపేట ఇలవేల్పుగా భ్రమరాంబ (అంబగుడి) ఆలయం వెలుగొందుతుంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.2 /21.4
చలి ప్రభావం అధికంగా ఉంటుంది. విపరీతమైన మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో విజేత భీంపురం జట్టు



ఉండవెల్లి: సంక్రాంతి సందర్భంగా పుల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీ విజేతగా భీంపురం జట్టు నిలిచింది. మండలంలోని పుల్లూరులో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడంతో దాదాపు 50 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ పోరు రసవత్తరంగా సాగగా.. చివరకు గద్వాల మండలం భీంపురం జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా కర్నూల్ జిల్లా పంచలింగాలకి చెందిన జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ.30వేలు, రన్నర్ జట్టుకు రూ.25వేలను ఎమ్మెల్యే విజేయుడు అందజేశారు.

పీఎం మోదీ వర్చువల్ సమావేశానికి ఏర్పాట్లు



మన్ననూర్: నల్లమల ఆదివాసీ చెంచులతో ప్రధాని నరేంద్రమోదీ సోమవారం ఢిల్లీ నుంచి నిర్వహించనున్న వర్చువల్ సమావేశానికి మన్ననూర్ గిరిజన గురుకుల పాఠశాల (పీటీజీ)లో అధికారులు ఏర్పాట్లు చేశారు. పీఎం జన్ మన్ యోజనలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని 88 గ్రామాలు, చెంచు పెంటలకు చెందిన సుమారు 1000 మందితో ప్రధాని మోదీ వర్చువల్‌గా సమావేశం నిర్వహించనున్నారు. ఈసమావేశంలో చెంచుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారని డీటీడీఓ కమలేశ్వర్‌రెడ్డి చెప్పారు. కాగా గిరిజన గురుకుల పాఠశాలలో భద్రతా ఏర్పాట్లను అమ్రాబాద్ ఎస్ఐ వీరబాబు పర్యవేక్షించారు.

చెంచులు అధిక సంఖ్యలో హాజరుకావాలి

నాగర్‌కర్నూల్: పీఎం నరేంద్రమోదీ సోమవారం వర్చువల్‌గా నిర్వహించనున్న సమావేశానికి జిల్లాలోని 88 ఆవాస గ్రామాల చెంచులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పీఎం జన్‌మన్ యోజనలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు వర్చువల్‌గా సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. చెంచు ప్రజలు ఉదయం 10 గంటలకే మన్ననూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలకు చేరుకోవాలని సూచించారు.

ఇంటింటా భోగి వేడుకలు



ఉండవెల్లి మండలం పుల్లూరులో భోగి మంటల మధ్య కుటుంబసభ్యుల సందడి

- బంధుమిత్రులతో కళకళలాడిన పల్లెలు
- రంగుల లోగిళ్లతో నిండిన ముంగిళ్లు
- పిండి వంటల ఘుమఘుమలు
- నేడు మకర సంక్రాంతి

గద్వాల/అలంపూర్/శాంతినగర్: రంగవళ్లులు, గొబ్బెమ్మలతో నిండిన ముంగిళ్లు.. వెచ్చదనాన్ని అందించే భోగి మంటలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. పిండివంట ఘుమఘుమలు.. మొత్తంగా జిల్లాలో భోగి సంబరాలు అంబరాన్నంటాయి. మకర సంక్రాంతి నేపథ్యంలో ఆదివారం భోగి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలుగు సంస్కృతి, సాంప్రదాయానికి నిదర్శనంగా నిలిచే పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకొన్నారు. పిండి వంటలు, పతంగుల కోలాహలం, రంగురంగుల ముగ్గులు, కొత్తగా పండిన ధాన్యాలు.. గొబ్బెమ్మలు తదితర దృశ్యాలు కనిపించాయి.

మూడు రోజులపాటు..

భోగితో ప్రారంభమైన వేడుకలు కనుమతో ముగిస్తారు. సాంప్రదాయం వంటకాలు మొదటిరోజు సజ్జ, నువ్వులరొట్టెలు, తోడుగా రుచికరమైన కూరలు చేసుకున్నారు. ప్రతి ఇంటిలో వివిధ రకాలైన కాయగూరలతో కలకూర వండుకుని రుచికరమైన వంటలు ఆరగించారు. జిల్లా కేంద్రంతో పాటు అలంపూర్, వడ్డేపల్లి, అయిజ, మానవపాడు, మల్దకల్ తదితర ప్రాంతాల్లో సంక్రాంతి సౌరభాలు వెల్లివిరిశాయి.



అలంపూర్ చౌరస్తాలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

ఆడపడుచులు.. అల్లుళ్ల రాకతో సందడి

మకర సంక్రాంతి ముందురోజు జరుపుకొనే భోగి సంబరాలు శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే ప్రజలు భోగిమంటలు వేసి.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా మంటల చుట్టూ ఆటలాడుతూ.. పాటలు పాడుతూ.. చలి మంటలు కాపుకుంటూ.. సంబరాలు మొదలుపెట్టారు. మహిళలు, యువతులు ఇళ్లముందు ముగ్గులు వేస్తూ రంగులు నింపుతూ రంగవళ్లులతో ఆనందంగా గడిపారు. పండగకు వచ్చిన ఆడపడుచులు, అల్లుళ్ల రాకతో సందడి నెలకొంది. నువ్వుల పిండి, రేగి పళ్లతో స్నానాలు ఆచరించి కీడు తొలగించుకున్నారు. నువ్వుల రొట్టెలు, నువ్వులు, బియ్యంతో ప్రత్యేకంగా చేసిన వంటలను దేవతామూర్తులకు నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లముందుకు పాటలు పాడుకుంటూ వచ్చిన వారికి దాన ధర్మాలు చేస్తూ పిల్లా పాపలతో భోగి సంబరాలు ఆనందంగా జరుపుకొన్నారు. సోమవారం నిర్వహించే మకర సంక్రాంతి పర్వదినం సంబరాలకు సన్నద్ధమయ్యారు. ఆయా గ్రామాల్లో గ్రామీణ క్రీడలు, కబడ్డీ పోటీలు నిర్వహించారు. జీవనోపాధి, చదువులు, ఉద్యోగాల వేటలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు పండగకు తరలిరావడంతో ప్రతి పల్లె.. ప్రతి ఇల్లు బంధుమిత్రులు, కుటుంబసభ్యులతో కళకళలాడింది.



అలంపూర్ చౌరస్తాలో భోగిమంటల వద్ద చిన్నారులు

భోగిపండ్లతో చిన్నారులకు దీవెనలు

భోగి పర్వదినాన చిన్నారులపై భోగిపండ్లు (రేగిపళ్లు) పోసి పెద్దలు దీవించడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నారులను దీవించేందుకుగాను శాంతినగర్‌లో ప్రతి ఏట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేస్తారు. ఏళ్ల క్రితం ఆంధ్రా నుంచి కొందరు శాంతినగర్‌కు వచ్చి ఇక్కడే పంట పొలాలు సాగు చేస్తూ స్థిర నివాసం ఏర్పాటుచేసుకొన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా ఆంధ్రా ప్రాంతం నుంచి వచ్చిన వారు వారి కుటుంబంలోని చిన్నారులకు భోగిపళ్లు పోసి దీవెనలు అందించడం ఇక్కడి ప్రత్యేకత. సాయంత్రం ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసి వరుసగా భోగిపళ్లు పోస్తూ పెద్దలు దీవెనలు అందించారు. హరివిల్లు రంగుల్ని పులుముకున్న కాగితం పక్షులు గాలిపటాలతో పిల్లలు ఆనందంగా గడిపారు. పలు గ్రామాల్లో పిల్లలతోపాటు పెద్దలను సైతం గాలిపటాలు రంజింప చేశాయి. పండగను పురస్కరించుకొని పలుచోట్ల రంగవల్లుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.



ఉండవెల్లిలో ముగ్గు వేస్తున్న యువతులు.. చిన్నారులు





శాంతినగర్‌లో ముగ్గులో రంగు వేస్తున్న చిన్నారి

వైభవంగా గోదారంగనాథస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

- అధిక సంఖ్యలో హాజరైన భక్తులు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

ఎర్రవల్లిచౌరస్తా: ధనుర్మాసవ్రత మహోత్సవాలలో భాగంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం గోదా రంగనాథస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ఆలయంలో సుప్రభాతసేవ, ప్రబంధ పారాయణం, సాత్తుముఱై, తీర్థ ప్రసాదగోష్టి వంటి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో గోదా రంగనాథ కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో కల్యాణంలో పాల్గొని కనులారా తిలకించారు. నాగేశ్వరెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు, వివిధ ప్రాంతాల నుంచి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, పాలక మండలి సభ్యులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.



తిలకిస్తున్న భక్తులు

విభజన హామీల అమలుపై వివక్ష తగదు



కరపత్రాలు విడుదల చేస్తున్న టీజేఎస్ నాయకులు

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా వివక్ష చూపడం తగదని తెలంగాణ జనసమితి జిల్లా కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజనలో భాగంగా ఉద్యోగ విభజనలో తెలంగాణ వారిని సొంత రాష్ట్రానికి తెప్పించుట, రాష్ట్రంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్ తదితర హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన హామీల అమలు – కేంద్ర ప్రభుత్వ వివక్షతపై ఈనెల 21న ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వర్య భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్, వీరభద్రప్ప, మహబూబ్ పాష, ఇస్మాయిల్, మధు, రాజు తదితరులు ఉన్నారు.

చివరి తడికి నీటిని సరఫరా చేయండి



రామన్‌పాడు ప్రాజెక్టులో నీటినిల్వను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

మదనాపురం: ఆయకట్టు కింద యాసంగి పంటలు సాగుచేసిన రైతులకు చివరి తడి నీటిని అందించాలని, అందుకు అవసరమైన నీటిని రామన్‌పాడు జలాశయం నుంచి విడుదల చేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. యాసంగి పంటలకు సరిపడా నీరందక ఎండిపోతున్నాయని.. కనీసం చివరి తడికైనా నీటిని విడుదల చేయాలని పలువురు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం ఆయన రామన్‌పాడు జలాశయాన్ని సందర్శించి నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి నీటి నిల్వపై ఆరా తీశారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా, పంటలకు చివరి తడి నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్‌పార్టీ కిసాన్‌సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు నాగన్న, వడ్డె కృష్ణ, అంజత్‌అలీ, సాయిబాబా, తిరుపతిరెడ్డి ఎస్‌ఈ సత్యశీలారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రముఖుల ప్రత్యేక పూజలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను ఆదివారం అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, దేవాదాయశాఖ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ ఎల్.వెంకటాచారి, హైదరాబాద్‌లోని కాంటినెంటల్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కృష్ణమోహన్ దర్శించుకున్నారు. అలాగే ఎస్‌బీఐ కి చెందిన జీఎం దిబశిష్ మిత్ర, డీజీఎం ప్రశాంత్ కుమార్ బొరియార్, డీజీఎం వెంకటచంద్ర జైస్వాల్, ఆర్.ఎం వెంకటనారాయణ దర్శించుకున్నారు ఇదిలాఉండగా ఎస్‌బీఐ వారు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.లక్ష విలువ గల వాటర్ కూలర్, వికలాంగులు, వృద్ధుల కోసం రెండు వీల్ చైర్‌లు ఆలయానికి అందజేశారు. ఆలయ ఈఓ, అర్చకులు ప్రముఖులకు ఘన స్వాగతం పలికి ఆలయాల్లో పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ అధికారులు వాటర్ కూలర్‌ను పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య ధర్మకర్తలు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డిలు ఉన్నారు.

15న క్యాలెండర్ ఆవిష్కరణ

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలకు చెందిన ఆంగ్లనామ సంవత్సరాది నూతల క్యాలెండర్‌ను ఈ నెల 15వ తేది ఆలయంలో ఆవిష్కరిస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే విజయుడు హాజరవుతారన్నారు. కర్నూలుకు చెందిన బికే సింగ్ ఈ క్యాలెండర్లను ముద్రించి భక్తులకు వితరణ చేస్తున్నట్లు తెలిపారు



అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు స్వాగతం పలుకుతున్న అర్చకులు



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం..

పాన్‌గల్: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడుతాయని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం మండలంలోని కేతేపల్లిలో జాతీయస్థాయి మహిళలు, పురుషుల నెట్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో కలిసి కాసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపర్చారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో క్రీడల్లో పాల్గొనే వారి సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందని.. సెల్‌ఫోన్లకు బానిసలు కావడంతో అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. శారీరక దృఢత్వానికి క్రీడలు, నడక, వ్యాయామంతో పాటు ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటే దేనినైనా సాధించవచ్చని.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డా. శ్రీనివాసులు, రవికుమార్, వెంకటేష్‌నాయుడు, భాస్కర్‌యాదవ్, పుల్లారావు, బ్రహ్మయ్య, విష్ణు పాల్గొన్నారు.

చింతలకుంటవాస.. గోవిందా

- నేటినుంచి ఆంజనేయస్వామి ఉత్సవాలు ప్రారంభం
- మాంసమే నైవేద్యం.. కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చి మొక్కుల చెల్లింపు
- 17న ముగింపు కార్యక్రమం



స్వామివారి మూలవిగ్రహం



చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయం

పెబ్బేరు రూరల్: ఎక్కడైనా ఆంజనేయస్వామికి సింధూరం, తమలపాకులతో పూజలు నిర్వహిస్తారు. కానీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెబ్బేరు నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాతపల్లి శివారులో వెలసిన చింతలకుంట ఆంజనేయస్వామికి మాత్రం మాంసం, కల్లుతో నైవేద్యం సమర్పిస్తారు. ఏకంగా స్వామివారి ఎదుటే పొట్టేళ్లు, కోళ్లు బలిస్తారు. ప్రతిఏటా సంక్రాంతి పండుగ నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించే ఈ ఉత్సవాలకు స్థానికులేగాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. సోమవారం ప్రారంభమైన ఉత్సవాలు 17వ తేదీన ముగుస్తాయి. ఇక్కడి స్వామివారికి అపారమైన శక్తి ఉందని.. కోరిన కోర్కెలు తీరుస్తారని భక్తుల ప్రగాఢ నమ్మకం. శ్రీరంగాపూర్ మొదటి పరిపాలన రాజు వాసుదేవ రావు తాను కోరిన కోరిక నెరవేరడంతో ఆలయాన్ని నిర్మించారు.

ఆలయ చరిత్ర..

ఈ ఆలయానికి సుమారు 300 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో ఆలయం చుట్టుపక్కల చింతచెట్లు ఎక్కువగా ఉండటం.. వాటి కింద రాక్షసులు నివాసం ఉండి మనుషులు, పశువులను చంపి ఆహారంగా భుజించేవారని.. భయభ్రాంతులకు లోనైన ప్రజలు తమను రక్షించాలని ఆంజనేయ స్వామిని వేడుకోవడంతో స్వామివారు ఇక్కడ కొలువై రాక్షసకాండకు ముగింపు పలికాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో రాక్షసులు మీరు ఇక్కడ కొలువుదీరితే మాకు ఆహారం ఎలా లభిస్తుందని హనుమంతుడిని వేడుకోవడంతో భక్తులు తనకు నైవేద్యంగా జంతువులను బలిస్తారని.. వాటితో కడుపు నింపుకోవాలని, మనుషుల జోలికి వెళ్లవద్దని చెప్పినట్లు ఓ కథ ప్రచారంలో ఉంది. దీంతోనే ఈ ఆలయంలో భక్తులు స్వామివారికి మాంసహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తున్నారు.

మాంసమే నైవేద్యం..

అన్ని ఆంజనేయస్వామి ఆలయాల్లో సింధూరం, తమలపాకులు, టెంకాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించి శాఖహార వంటకాలతో నైవేద్యం సమర్పిస్తారు. కానీ ఈ ఆలయంలో మాత్రం భక్తులు మాంసం, మద్యం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. తాము కోరుకున్న కోరిక తీరిన భక్తులు కోళ్లు, పొట్టేళ్లను బలిస్తారు. కొనుగోలు చేసిన కొత్త వాహనాలకు ఆలయ సన్నిధిలో పొట్టేళ్లు బలిచ్చి పూజలు చేయిస్తారు.

సౌకర్యాల కల్పన..

ఉత్సవాల సందర్భంగా ఆలయానికి భక్తులు భారీగా తరలివస్తారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పెబ్బేరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

మక్తల్ నుంచి అయోధ్యకు..

మక్తల్: అయోధ్యలోని రామమందిరంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠలో పాల్గొనేందుకు మక్తల్ మండలం సత్యవార్ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై యాత్రగా బయల్దేరారు. గుండ్లకుంట నారాయణ, చంద్రకాంత్ ఇద్దరు కలిసి ఆదివారం మక్తల్ నుంచి అయోధ్యకు బైక్ యాత్ర ప్రారంభించారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు.

క్లుప్తంగా

కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం


కార్తీక్ గౌడ్(ఫైల్)

కోస్గి: వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో ఓ విద్యార్థి కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. మండలంలోని సర్జఖాన్‌పేటకు చెందిన మొగులయ్యగౌడ్ కుమారుడు కార్తీక్ గౌడ్ (16) గ్రామంలోని పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం శివారులోని తమ వ్యవసాయ పొలానికి బైక్‌పై వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో సర్జఖాన్‌పేట–పల్లెగడ్డ రోడ్డు మలుపు వద్ద కోస్గికి చెందిన కారు వేగంగా తుంకిమెట్ల వైపు వెళ్తూ బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దీంతో బాలుడి తల పగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామ నిర్వహించారు. బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి. తండ్రి మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి బీటెక్ విద్యార్థి..

- మరొకరికి తీవ్ర గాయాలు

కొల్లాపూర్: పట్టణం నుంచి సోమశిలకు వెళ్లేదారిలో రోడ్డు ప్రమాదానికి గురై జలకం వంశీ(21) దుర్మరణం చెందాడు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని తెలుగు వీధికి చెందిన వంశీతో పాటు అతని మిత్రులు ప్రణవ్‌తేజ్, రాంచందర్ బైక్‌పై సోమశిలకు వెళ్లారు. మార్గమధ్యలో కేఎల్ఐ కాల్వ సమీపంలో బైక్ అదుపుతప్పి వారు కిందపడ్డారు. బైక్ నడుపుతున్న వంశీ తలకు, ప్రణవ్‌తేజ గొంతుకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు గుర్తించి వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోపే వంశీ మృతి చెందాడు. ప్రణవ్‌తేజ పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రాంచందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వంశీ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. అతని మృతితో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భర్త మాటవినడం లేదని భార్య బలవన్మరణం

బిజినేపల్లి: మండలంలోని శాయిన్‌పల్లికి చెందిన సైదమ్మ (55) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం వెలుగు చూసింది. ఎస్ఐ రాములుయాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం సైదమ్మ తన భర్త నారాయణకు మొక్కజొన్న పంటకు నీళ్లు పారించాలని సూచించింది. ఈ మాటను పట్టించుకోకుండా నారాయణ బయటికి వెళ్లిపోయాడు. భర్త తన మాట వినడం లేదని మనస్తాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకుంది. కుటుంబసభ్యులు సాయంత్రానికి వచ్చి చూసే సరికి ఆత్మహత్య చేసుకుని ఉన్నట్లు గుర్తించి స్థానికులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ


షాపు వెనుక పెట్టిన రంధ్రం

మిడ్జిల్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న నరేష్ మొబైల్ షాప్‌లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి షాప్ మూసేసి ఇంటికి వెళ్లిన తర్వాత షాప్ వెనుక వైపున రేకును కత్తెరించి రిపేర్‌కు వచ్చిన సెల్‌ఫోన్స్, కొత్త ఫోన్స్, చార్జర్లు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం షట్టర్ తీసేసరికి వస్తువులు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు పోలిసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. చోరీకి గురైన ఫోన్ల విలువ దాదాపు రూ.70వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పట్టపగలు బైక్..

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో బైక్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సింగారం చెందిన భరత్ స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని భవనంలో బ్రాడ్‌బ్యాండ్ నెట్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం 10:15గంటలకు బైక్‌పై వచ్చి బేకరి ఎదురుగా పార్క్‌చేసి విధుల్లోకి వెళ్లాడు. తర్వాత వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. అక్కడ ఉన్నవారిని వాకాబు చేసి, వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించారు. వాటిద్వారా బైక్ ఎత్తుకెళ్లిన వ్యక్తిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

మత్స్యబీజం.. ఆమడదూరం

- చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు జూరాల ప్రాజెక్టు వద్ద ప్రతిపాదనలు
- రెండేళ్లవుతున్నా ముందుకుసాగని పనులు
- పీజేపీ, మత్స్యశాఖ అధికారుల సమన్వయలోపం
- మత్స్యశాఖ పేరిట స్థలం కేటాయించకపోవడమే కారణం


జూరాల ప్రాజెక్టు వద్ద స్థల సేకరణలో అధికారులు (ఫైల్)



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం, మార్కెట్, పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని రెండేళ్ల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాజెక్టు వద్ద కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాలు ఉన్నప్పటికీ మత్స్యశాఖ, పీజేపీ అధికారుల సమన్వయ లోపంతో ప్రతిపాదనలకే పరిమితమైంది.

- **వివరాల్లోకి వెళ్తే..**

జిల్లాలోని సరళాసాగర్ వద్ద ఇప్పటికే చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కొనసాగుతుండగా.. జూరాల ప్రాజెక్టు, మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్ వద్ద కొత్తగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. జూరాల వద్ద త్వరితగతిన స్థల సేకరణ చేపట్టాలని మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులకు రెండేళ్ల కిందట ఆదేశాలు అందాయి. దీంతో ఆయా శాఖల అధికారులు ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధి కేంద్రం ఏర్పాటుకు అనువుగా ఉందని.. 20 ఎకరాలు కేటాయించాలని ప్రాజెక్టు అధికారులకు వివరించారు. అంత మొత్తంలో భూమిని అప్పగించమని.. కేంద్రం ఏర్పాటుకు సరిపడా భూమి కేటాయిస్తామని ప్రాజెక్టు అధికారులు సమాధానమిచ్చారు. దీంతో ఇరుశాఖల మధ్య సమన్వయం కుదరకపోవడంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంతో పాటు మార్కెట్ పనులు వాయిదా పడ్డాయి.

సరళాసాగర్‌లో లక్ష్యానికి దూరం..

జిల్లాలోని సరళాసాగర్ వద్ద మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. ఇక్కడ 40 లక్షల చేప పిల్లల ఉత్పత్తి జరుగుతుందని భావించినా.. 20 లక్షలు కూడా ఉత్పత్తి కాకపోవడంతో అధికారులు చేప పిల్లల పంపిణీ సమయంలో ఇతర ప్రాంతాల మీద ఆధారపడే పరిస్థితి నెలకొంది.

మార్కెట్ ఏర్పాటుతో..

జూరాల ఎడమ కాల్వ వద్ద చేపల మార్కెట్ ఏర్పాటు చేస్తే ఇక్కడి జాలర్లకు చేతినిండా పని దొరికే అవకాశం ఉంది. ఇక్కడి చేపలను ఉమ్మడి జిల్లాలోనే కాకుండా హైదరాబాద్, బెంగుళూరు, కోల్‌కత్తా తదితర పట్టణాలకు రవాణా చేస్తుంటారు. ప్రాజెక్టు సమీపంలోని నందిమళ్లలో ఉన్న 300 కుటుంబాలు చేపల విక్రయాలు, వంటకాల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

వనపర్తి జిల్లాలో 1,154 చెరువులు

జిల్లాలోని 14 మండలాల్లో 1,154 చెరువులను మత్స్యశాఖ అధికారులు గుర్తించి ఏటా ఉచితంగా చేప పిల్లలు వదుతున్నారు. గతేడాది 1,054 చెరువుల్లో 2.35 కోట్ల చేప పిల్లలను వదిలారు. కాగా ప్రతిసారి చేప పిల్లల కొనుగోలుకు అధికారులు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్తున్నారు.

సమన్వయ లోపమే..

మత్స్యశాఖ, ఇరిగేషన్ అధికారుల మధ్య సమన్వయం కుదరకపోవడంతో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు పనులు మరుగునపడ్డాయని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. కేటాయించిన స్థలం తమశాఖ పేరిట ఉండాలని మత్స్యశాఖ అధికారులు.. అలా కుదరదని ప్రాజెక్టు అధికారులు చెప్పడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా మారాయి.

ఖర్చు, రవాణా భారం తప్పుతుంది..



జూరాల వద్ద కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రతి ఏటా చేప పిల్లల కొనుగోలుకు ఇతర ప్రాంతాలకు వెళ్లే భారంతో పాటు ఖర్చు తగ్గుతుంది. అధికారులు, పాలకులు ప్రత్యేక దృష్టి సారించి కేంద్రం ఏర్పాటుకు చొరవచూపాలి.

– అశ్విన్‌కుమార్, మత్స్యకారుడు, ఆత్మకూర్

మార్కెట్ ఏర్పాటుపై దృష్టి సారించాలి..



ప్రాజెక్టు ఎడమ కాల్వ సమీపంలో 300 కుటుంబాలు చేపల విక్రయాలు, వంటల తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రభుత్వం చొరవచూపి జూరాల వద్ద చేపల మార్కెట్ ఏర్పాటు పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి.

– వాకిటి ఆశన్న, మత్స్యకారుడు, నందిమళ్ల

రెండు కోట్ల చేపల ఉత్పత్తి..



ఆత్మకూర్ మండలం ఆరేపల్లిలో 38 ఎకరాల్లో ప్రైవేటుగా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేశా. ఏడాదికి రెండు కోట్ల చేప పిల్లలను ఉత్పత్తి చేసి వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు ప్రభుత్వం తరపున విక్రయిస్తున్నా. వీటితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రైవేట్ వ్యక్తులకు సైతం విక్రయిస్తుండటంతో రూ. కోటి ఆదాయం సమకూరుతుంది.

– ఏటికాడి ఆనంద్, చేప పిల్లల పెంపకందారు

స్థల సేకరణ పూర్తి..



కలెక్టర్ ఆదేశాలతో జూరాల ప్రాజెక్టు వద్ద చేపల మార్కెట్‌తో పాటు చేప పిల్లల ఉత్పత్తి, పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని ఇదివరకే పరిశీలించాం. ప్రాజెక్టు ఈఈ, అమరచింత తహసీల్దార్‌తో కలిసి సమాంతర కాల్వ సమీపంలో 20 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నాం. ప్రాజెక్టు అధికారులు ఆ స్థలాన్ని మత్స్యశాఖ పేరిట రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని మత్స్యశాఖ డైరెక్టర్‌కు విన్నవించాం.

– రహమాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి, వనపర్తి

ఉన్నతాధికారులకు విన్నవించాం..



ప్రాజెక్టు వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం, మార్కెట్ ఏర్పాటుకు 20 ఎకరాల స్థలం కావాలని మత్స్యశాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించాం. వారి నుంచి అనుమతి వచ్చిన వెంటనే స్థలాన్ని మత్స్యశాఖ అధికారులకు అప్పగిస్తాం.

– సత్యశీలారెడ్డి, ఎస్ఈ, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

త్వరలోనే కార్యాచరణ..



పీజేపీ, మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. పీజేపీ ఈఎన్‌సీ వద్ద దస్త్రం పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుంటుంది.

– వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే, మక్తల్

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యమైనట్లు పట్టణ ఎస్ఐ మహేందర్ ఆదివారం తెలిపారు. మున్సిపాలిటీలోని ఎండబెట్లకు చెందిన వెంకటమ్మకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఈనెల 4 ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులకు రిమాండ్

ఊర్కొండ: మండలంలోని ముచ్చర్లపల్లిలో డిసెంబర్ 28న పందుల చోరీపై వచ్చిన ఫిర్యా దు మేరకు దర్యాప్తు చేసిన అనంతరం ముగ్గు రిని రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. హైదరాబాద్కు చెందిన మక్కల నాగే ష్, మక్కల రాజు, మక్కల రజినీకాంత్, రాజే ష్‌పై కేసు నమోదు చేయగా, రాజేష్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పా రు. నిందితులు ముగ్గురి నుంచి 28 పందులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం

నారాయణపేట రూరల్: టాస్క్‌ఫోర్సు దాడుల్లో రేషన్ బియ్యం పట్టుబడింది. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌రోడ్డులో అప్పిరెడ్డిపల్లికి చెందిన హన్మంతు ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. 20బస్తాల్లో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికింది. డీటీ పంచనామా చేయగా యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అమెరికాలో వనపర్తి విద్యార్థి మృతి

- అమ్మకు శుభాకాంక్షలు చెప్పి.. అనంత లోకాలకు
- వెళ్లిన 15 రోజుల్లోనే విషాదం
- మృతదేహం కోసం ఎదురుచూపులు


దినేష్ (ఫైల్)

వనపర్తిటౌన్: అమ్మానాన్నలతో మాట్లాడుతూ అమ్మకు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పిన కొన్ని గంటలకే ఆ కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఒక్కగానొక్క కొడుకును ఉన్నతంగా చదివించేందుకు 15 రోజుల కిందట ఎంఎస్సీ చేసేందుకు అమెరికాకు పంపిన తల్లిదండ్రులకు పండుగ పూట విషాదం నింపింది. వనపర్తి జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన గట్టు వెంకన్న, లావణ్య దంపతుల కుమారుడు గట్టు దినేష్ (22) డిసెంబర్ 28న ఎంఎస్సీ చేసేందుకు అమెరికాకు వెళ్లాడు. రోజులానే ఆదివారం తల్లిదండ్రులతో మాట్లాడి, తల్లికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన కొద్ది గంటలకే కన్న కొడుకు చనిపోయాడనే వార్త వినాల్సి వచ్చింది. కొడుకు బాగా చదువుకోవాలని అయ్యప్ప మాలవేసుకొని శబరిమలైకు బయలుదేరేందుకు సిద్ధమైన ఆ తండ్రి కుంగిపోయాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, పట్టణ ప్రముఖులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుమారుడి మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమ కుమారుడు నిద్రలోనే మరణించినట్లు అమెరికా పోలీసుల నుంచి సమాచారం అందిందని, రూంలోని హీటర్‌లో వాసనలేని విషవాయువు బహిర్గతం కావడంతోనే చనిపోయినట్లు తెలిసిందని చెప్పారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం: ఒకరికి గాయాలు


కొమ్మిరెడ్డిపల్లి వద్ద ప్రమాదశాత్తు దగ్ధమవుతున్న ఎలక్ట్రిక్ స్కూటీ

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి వద్ద ఆదివారం స్కూటీ దగ్ధమైంది. ఏపీ రాష్ట్రం ఆదోని పట్టణానికి చెందిన రామకృష్ణ హైదరాబాద్ నుంచి ఎలక్ట్రిక్ స్కూటీపై స్వస్థలానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొమ్మిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో స్కూటీ కల్వర్టు వద్ద అదుపు తప్పి కిందకి దూసికెళ్లింది. ఈ క్రమంలో స్కూటీకి మంటలు అంటుకోవడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. స్కూటీపై ఉన్న రామకృష్ణకు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాదవార్త తెలుసుకున్న ఎల్అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది ప్రమాద స్థలంలో క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

చెరువులో పడి తండ్రీకొడుకు మృతి

- ఒకరిని కాపాడబోయి మరొకరు..
- వనపర్తి దళితవాడలో విషాదఛాయలు


శివాన్ (ఫైల్)


రుషికేష్ (ఫైల్)

వనపర్తిటౌన్: వనపర్తి జిల్లా కేంద్రంలోని దళితవాడలో సంక్రాంతి పండుగ వేళ విషాదం నెలకొంది. సమీపంలోని చెరువులో బట్టలు ఉతికి, చేపలు పట్టేందుకు తండ్రీకొడుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు తండ్రి చెరువులో పడ్డాడు. అతడిని కాపాడేందుకు వెళ్లిన కుమారుడు సైతం చెరువులో గల్లంతై మృతి చెందాడు. ఎస్ఐ జయన్న, స్థానికుల వివరాల మేరకు.. వనపర్తి దళితవాడకు చెందిన గంధం శివాన్ (58), అతడి కుమారుడు రుషికేష్ (29) బట్టలు ఉతికేందుకుగాను స్థానిక నల్లచెరువుకు వెళ్లారు. చెరువులో బట్టలు ఉతకడంతో పాటు చేపల వేటకు గాలం వేశారు. ఈ క్రమంలో తండ్రి శివాన్ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గమనించిన కుమారుడు రుషికేష్ వెంటనే తన బాబాయ్‌కి ఫోన్‌చేసి 'నాన్న చెరువులో జారిపడ్డాడు.. కాపాడేందుకు వెళ్తున్నా'నని చెప్పి ఫోన్ పెట్టేశాడు. కొద్దిసేపటికే అక్కడికి చేరుకున్న బాబాయ్‌కి తన అన్నాకొడుకు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని కొండపేట నుంచి గజ ఈతగాళ్లను రప్పించి, గాలింపు చర్యలు చేపట్టారు. మొదట తండ్రి శివాన్ మృతదేహం లభించగా.. సాయంత్రం రుషికేష్ మృతదేహం లభ్యమైంది. తండ్రీకొడుకు మృతితో దళితవాడలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జయన్న తెలిపారు.

మహిళ మృతిపై వీడని మిస్టరీ

- మృతురాలిది ఉప్పునుంతలగా గుర్తింపు


బల్మూర్: నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని పోలేపల్లి శివారులో శనివారం రాత్రి గుర్తించిన గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి విచారణ చేపట్టారు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఆదివారం వివరాలు వెల్లడించారు. ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన బాలకిష్టమ్మ(45) ఈ నెల 12న శుక్రవారం పండుగ సరుకుల కోసమని అచ్చంపేటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పింది. కానీ రాత్రి అయినా కూడా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువుల ఇంటికి వెళ్లి ఉండొచ్చని భావించారు. శనివారం రాత్రి బల్మూర్ మండలంలోని పోలేపల్లి శివారులో అనుమానాస్పదస్థితిలో ఆమె మృతి చెందింది. బాటసారులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు చేసుకుని మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సామాజిక మాధ్యమాల్లో మృతదేహాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులను ఆశ్రయించగా ఆమె వివరాలు తెలిశాయి. మృతురాలు అచ్చంపేటకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పినా అక్కడికి వెళ్లకుండా ఉప్పునుంతల–బల్మూర్ మండలాల సరిహద్దుల్లోని పోలేపల్లి శివారుకి ఎందుకొచ్చిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా నోటి నుంచి నురగతో పాటు గొంతుపై కమిలిన గాయం ఉండటంపై ఇది హత్యగానే అనుమానాలు వ్యక్తం అవుతాయి. మృతురాలి కుమారుడు సాయికుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కాగా ఉప్పునుంతలకు చెందిన ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతురాలితో పాటు గ్రామానికి చెందిన మరో ఇద్దరు మహిళలు కల్లుకు బానిసలై రోజుల తరబడి ఇతర గ్రామాలకు వెళ్తుంటారని గ్రామస్తులు తెలిపారు.

వంటగ్యాస్ లీకేజీతో ఇంట్లో చెలరేగిన మంటలు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరులో ఆదివారం సల్వాల చంద్రయ్య తన ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. దీంతో చంద్రయ్య కుడి కాలు తొడ భాగం కాలడంతోపాటు ఇంట్లోని వస్తువులు, కొంత నగదు పూర్తిగా కాలిపోయాయి. దాదాపుగా రూ. 50 వేల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ఇరుగుపొరుగు వారు అప్రమత్తమై సిలిండర్‌ను ఆఫ్ చేయడంతోపాటు మంటలను ఆర్పివేశారు. గాయపడిన చంద్రయ్యను అంబులెన్స్‌లో అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఒంటరిగా ఉంటున్న వృద్ధుడు చంద్రయ్య వంట చేసుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

మామిడి సాగులో జాగ్రత్తలు అవసరం

- సస్యరక్షణతో దిగుబడి


పూత దశలోని మామిడి

అలంపూర్: మామిడి సాగులో జాగ్రత్తలు పాటిస్తేనే దిగుబడి సాధ్యం. ఈ ఏడాది మామిడి పంటలో పూత ఆశాజనకంగా ఉంది. మామిడి విదేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశాలు ఉండటంతో ధర బాగా పలికే అవకాశం ఉంది. మామిడిలో పూత, పిందె ఎక్కువగా వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పూతను, పిందెను నిలుపుకొని నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలంటే జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ సూచించారు. మామిడి సాగులో సస్యరక్షణను వివరించారు.

మామిడిలో పూల రకాలు..

మామిడిలో ఉండే పూల గుత్తిలో రెండు రకాల పుష్పాలు ఉంటాయి. ఒక రకం ద్విలింగ పుష్పాలు, రెండో రకం మగ పుష్పాలు. ప్రతి పూల గుత్తిలో రకాన్ని బట్టి 200 నుంచి 4,000 వరకు పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు రకాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు రుమాని రకంలో 0.74 శాతం, నీలం రకంలో 55 శాతం, లాంగ్రా రకంలో 69 శాతం, బంగనపల్లిలో 22 శాతం ద్విలింగ పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు మాత్రమే ఫలదీకరణం చెంది పిందెలుగా ఏర్పడుతాయి. మగ పూలు ఫలదీకరణంలో తోడ్పడి తర్వాత రాలిపోతాయి. ద్విలింగ పుష్పాల్లో కూడా ఫలదీకరణానికి ముందే పలు కారణాలతో రాలిపోతాయి. కొంత వరకు పూత, పిందె రాలడం సహజమే. అయినా వాటి తీవ్రతను బట్టి తగు జాగ్రత్తలు పాటించాలి.

పోషకాల యాజమాన్యం..

మామిడికాయలు అంగుళం పరిమాణం నుంచి భూజాలు ఏర్పడే వరకు చాలా త్వరగా పెరుగుతాయి. ఈ సమయంలో పోషకాలైన నత్రజని, పొటాష్‌ను తప్పక అందించాలి. నీటి వసతి ఉన్న పొలాల్లో చెట్టు వయస్సును బట్టి 500 గ్రాముల నుంచి కిలో వరకు, 300 గ్రాముల పొటాష్‌ను పిందెలు బాదం కాయ పరిమాణం ఉన్నప్పుడు వేసి నీరు పెట్టాలి. నీటి వసతి లేని తోటల్లో నీటిలో కరిగే ఎరువులైన పాలీఫీడ్, మల్టీ–కె ఎరువులు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

హార్మోన్ల యాజమాన్యం..

హార్మోన్ల లోపం, సమతుల్యత దెబ్బతింటే పూత, పిందె బాగా రాలుతుంది. దీని నివారణకు ప్లానోఫిక్స్ మందును 5 లీటర్ల నీటిలో/మి.లీ కలపుకొని పిచికారీ చేసుకోవాలి. ఈ మందును మోతాదుకు మించి పిచికారీ చేస్తే పిందె రాలిపోయే ప్రమాదం ఉంది. దీన్ని జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలి.

భూమిలో తేమ..

ఎండా కాలంతో భూమిలోని తేమ ఆవిరి అవడంతో నీటి ఎద్దడికి గురై పూత, పిందె రాలిపోతుంది. అలాగే నీరు ఎక్కువగా పెట్టిన, వర్షం ఎక్కువగా పడిన పూత, పిందె ఎక్కువగా రాలిపోతుంది. గోళికాయ సైజు పిందె దశలో తేలికపాటి నీటి తడి ఇవ్వాలి. నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు ఆ తర్వాత నెలకోసారి రెండు తడులు ఇవ్వాలి. దీంతో కాయరాలడం తగ్గడంతో పాటు నాణ్యత పెరిగి కాయ పరిమాణం కూడా పెరుగుతుంది.

చీడపీడలు..

మామిడికి చీడ పీడలు పూత, పిందె దశలో ఆశించడంతో పూత, పిందె బాగా రాలుతుంది. పురుగు, తెగుళ్లను జాగ్రత్తగా గమనిస్తూ తగు చర్యలు తీసుకోవాలి.

తేనె మంచు పురుగు..

పూత, పిందె దశలో ఈ పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చితో పూత మాడిపోతుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ అనే మందును తగిన మోతాదులో వాడుకోవాలి.

తామర పురుగులు..

తామర పురుగులు రసాన్ని పీల్చడంతో పూత రాలిపోతుంది. పిందె దశలో కాయపై గోకి రసాన్ని పీల్చడంతో మచ్చలు ఏర్పడుతాయి. ఇవి ఆశించిన కాయలపై మంగు ఏర్పడుతుంది. వీటి నివారణకు డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు/లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి.

బూడిద తెగులు..

ఆకులు, పూత, పిందెలపై తెల్లని బూడిద వంటి పొడి ఏర్పడుతుంది. తెగులు సోకిన పూత, పిందెలు రాలిపోతాయి. దీని నివారణకు పూత మొగ్గ దశలో హెక్సాకొనజోల్/మిల్లీలీటరు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

ఇసుక బకాసురుడు చంద్రబాబు | తవ్వుకో.. తినుకో!

ఇసుక ఉచితమంటూ ఊడ్చేశారు • పచ్చ ముఠా లూటీ రూ.10 వేల కోట్లు

- గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు బేఖాతర్
- ఆర్థిక శాఖ ఆమోదం, మంత్రి మండలి తీర్మానం లేదు
- 'ప్రత్యేక మెమో'ముసుగులో యథేచ్ఛగా దోపిడీ
- ఏ1 పీతల సుజాత, ఏ 2 చంద్రబాబు, ఏ 3 చింతమనేని, ఏ 4 దేవినేని ఉమా
- నేడు పారదర్శక విధానాలతో ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం



సాక్షి, అమరావతి: ఇసుక నుంచి తైలం పిండటంలో నిజమెంత ఉందో తెలియదుగానీ ఇసుక నుంచి వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టవచ్చని చంద్రబాబు నిరూపించారు. అది కూడా ఇసుక ఉచితం అని బురిడీ కొట్టించి దోపిడీకి పాల్పడటం ఆయనకే సాధ్యమైంది. తాను అక్రమంగా నివాసం ఉంటున్న కరకట్ట ఇంటి వెనుకే వేల కొద్దీ లారీల్లో ఇసుక తరలిపోతున్నా గుడ్లప్పగించి చూశారు. టీడీపీ హయాంలో 'ఉచిత ఇసుక విధానం'ముసుగులో పచ్చ ముఠా సాగించిన దోపిడీని సీఐడీ పూర్తి ఆధారాలతో సహా బట్టబయలు చేసింది. కేంద్ర చట్టాలు, గ్రీన్ ట్రిబ్యునల్ విధివిధానాలను ఉల్లంఘించి కేబినెట్ ఆమోదం కూడా లేకుండా 'ప్రత్యేక మెమో'ద్వారా చంద్రబాబు చేసిన లూటీ ఆధారాలతో బహిర్గతమైంది. 2016 నుంచి 2019 వరకు ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా చంద్రబాబు ముఠా ఏకంగా రూ.10 వేల కోట్ల విలువైన ఇసుక దోపిడీకి పాల్పడిందన్నది నిగ్గు తేలింది.

అంతులేని ధన దాహం

2014లో టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు కన్ను ఇసుక రీచ్‌లపై పడింది. అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడినా ఆయన సంతృప్తి చెందలేదు. దీంతో ఇసుక విధానాన్ని పునసమీక్షించాలని కేబినెట్ సబ్ కమిటీని నియమించారు. కొత్త ఇసుక విధానాన్ని నిర్ణయిస్తూ 2016 జనవరి 15న రెండు జీవోలు (జీవో నంబర్లు 19, 20) జారీ చేశారు. అయినప్పటికీ చంద్రబాబు ఇసుక దాహం తీరలేదు. బరితెగించి ఇసుక దోపిడీకి పాల్పడేందుకు మరో విధానాన్ని తీసుకురావాలని భావించారు. 'ఇసుకను ప్రభుత్వం అమ్మదు.. ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదు.. ఎవరికి వారు ఇసుక రీచ్‌లకు వెళ్లి ఇసుక తవ్వుకోవచ్చు.. అమ్ముకోవచ్చు.. ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు, ఆంక్షలు విధించదు'అని చెబుతూ 2016 మార్చి 4న ఉచిత ఇసుక విధానాన్ని తెచ్చి దొరికిన చోట దొరికినట్లు దోచుకున్నారు. ఇసుక రీచ్‌లు అన్నింటినీ చంద్రబాబు తన చేతిలోకి, మంత్రివర్గ సభ్యులు, టీడీపీ ఎమ్మెల్యేల ఆధీనంలోకి తీసుకొచ్చారు.

> ఏ1: పీతల సుజాత
> (టీడీపీ ప్రభుత్వంలో గనుల శాఖ మంత్రి)
> ఏ2: నారా చంద్రబాబు
> (టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి)
> ఏ3: చింతమనేని ప్రభాకర్
> (టీడీపీ మాజీ ఎమ్మెల్యే)
> ఏ4: దేవినేని ఉమామహేశ్వరరావు
> (టీడీపీ ప్రభుత్వంలో జల వనరుల శాఖ మంత్రి)
>
> **ప్రధాన సెక్షన్లు ఇవీ...**
>
> చంద్రబాబు, ఇతర నిందితులపై నమోదు చేసిన సెక్షన్లు..
> ఐపీసీ సెక్షన్లు 120 బి, 409 రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 (1) (డి) రెడ్‌విత్ 13 (2)

మూడు మార్గాలు బేఖాతర్..

భారీ ఇసుక దోపిడీ కోసం చంద్రబాబు అన్ని నిబంధనలను ఉల్లంఘించారు. ఒక 'మెమో'తో ఇసుక దోపిడీకి పన్నాగం పన్నారు. కేంద్ర ప్రభుత్వ చట్టానికి లోబడే ఇసుక తవ్వకాల కోసం విధానాలు రూపొందించాలి. అందుకు నిర్దేశించిన మూడు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఒకటి ఎంపిక చేసుకోవాలి. ఇసుక తవ్వకాల కోసం జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ రూపొందించిన బిజినెస్ రూల్స్ (మార్గదర్శకాలు) అనుసరించాలి. అంతకంటే మెరుగైన విధానం రూపొందించామని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తే ఆమేరకు ఆర్థిక శాఖ ఆమోదం పొందాలి. ఓ విధానాన్ని రూపొందించి అందుకు కేబినెట్ ఆమోదం పొందాలి. చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా తెచ్చిన 'ఉచిత ఇసుక విధానం'కోసం ఈ మూడింటిలో ఏ ఒక్కటీ పాటించలేదు.

మెమో 3066తో కనికట్టు

'ఉచిత ఇసుక విధానం'విధానాన్ని తెస్తూ టీడీపీ ప్రభుత్వం 2016 మార్చి 4న ప్రత్యేకంగా 'మెమో 3066'జారీ చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లన్నీ చంద్రబాబు, ఆయన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు హస్తగతం చేసుకున్నారు. సహజ వనరులు, రాష్ట్ర ఖజానాకు కీలకమైన ఆర్థిక వనరుకు సంబంధించి కేబినెట్ ఆమోదం లేకుండానే అడ్డగోలుగా కేవలం ఒక మెమోను సాకుగా చూపి రంగంలోకి దిగారు. ఈ మెమో ద్వారా 2016 నుంచి 2019 వరకు అడ్డూ అదుపు లేకుండా ఇసుకను కొల్లగొట్టారు. రేట్లపై, తవ్వకాలపై నియంత్రణ లేదు. జిల్లాల వారీగా ఇసుక రీచ్‌లలో ఎవరెవరు తవ్వుకోవాలో చంద్రబాబు స్వయంగా తన బినామీలు, సన్నిహితులు, టీడీపీ ఎమ్మెల్యేలకు అప్పగించారు. ఒక్కసారిగా భారీ యంత్రాలను ఇసుక తవ్వకాల కోసం తెచ్చారు. ఇతరులు ఎవరూ ఆ ఇసుక రీచ్‌ల వైపు కన్నెత్తి కూడా చూడకుండా కట్టడి చేశారు. చంద్రబాబు ముఠా రోజూ వేల లారీల్లో లక్షల టన్నుల ఇసుకను తవ్వేసి అమ్ముకుంది. రాష్ట్రంలో నదుల్లో అందుబాటులో ఉన్న ఇసుక ఎంత..? రోజుకు ఎంత తవ్వుతున్నారు? ఎంతకు అమ్ముతున్నారు? ఎన్ని వేల లారీల ఇసుక రోజూ రాష్ట్రం దాటుతోంది? అనేదానికి అంతూపొంతూ లేకుండా పోయింది.

అడ్డుకున్న మహిళా అధికారి వనజాక్షిపై దాడి..

ఇసుక దోపిడీ కుట్రకు చంద్రబాబు సూత్రధారి కాగా అప్పటి గనుల శాఖ మంత్రి పీతల సుజాత, నీటి పారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో పాటు మరికొందరు ప్రధాన పాత్రధారులుగా వ్యవహరించారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు యథేచ్ఛగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారు. అక్రమ ఇసుక తవ్వకాలను ప్రశ్నించినందుకు తహ శీల్దార్ వనజాక్షిని టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జుత్తు పట్టుకుని మరీ దాడికి పాల్పడ్డారు. తహశీల్దార్‌పై దాడికి పాల్పడిన తన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను నాటి సీఎం చంద్రబాబు సమర్థించడం విస్మయ పరిచింది. తమ ఇసుక దోపిడీకి అడ్డు వస్తే ఎవరికైనా అదే గతి పడుతుందని సందేశం ఇచ్చేందుకే చంద్రబాబు అలా వ్యవహరించారు.

ఆ ఆదాయం ఏమైంది?



గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాల ద్వారా ఖజానాకు నాలుగు రకాల ఆదాయం రావాలి. సీనరేజీ, కన్సిడరేషన్ చార్జీలు, డిస్ట్రిక్ట్ మైన్స్ ఫండ్, మెరిట్ ఫీజు చెల్లించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను పాటిస్తూ కొత్త ఇసుక విధానాన్ని తెచ్చింది. దూరాన్ని బట్టి ఏ రీచ్ నుంచి ఎంత చార్జీ అనే అంశాన్ని నిర్ణయించి పారదర్శకంగా ప్రకటిస్తోంది. దీంతో రాష్ట్ర ఖజానాకు రూ.766 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ ప్రకారం టీడీపీ హయాంలో 2016 నుంచి 2019 వరకు కనీసం రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాష్ట్ర ఖజానాకు రావాల్సి ఉంటుందని గనుల శాఖ అంచనా వేసింది. చంద్రబాబు 'ఉచిత ఇసుక'అనే మోసపూరిత విధానంతో ప్రభుత్వ ఖజానాకు రూ.వెయ్యి కోట్ల గండిపడింది. ఇక రాష్ట్రంలో యథేచ్ఛగా తవ్విన ఇసుక ఎంతనే అంచనాలు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. 2016 నుంచి 2019 వరకు చంద్రబాబు ముఠా రాష్ట్రంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఇసుకను తవ్వి అమ్మేసుకుందన్నది విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పక్కా ఆధారాలతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో సీఐడీ తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాజ్యసభలో టీడీపీ అడ్రస్ గల్లంతే..

ఏప్రిల్ 2తో పూర్తికానున్న టీడీపీ సభ్యుడు 'కనకమేడల' పదవీకాలం

- వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి, బీజేపీ సభ్యుడు సీఎం రమేష్‌ల పదవీకాలం ముగిసేదీ అప్పుడే
- రాష్ట్ర కోటాలో ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చిలో ఎన్నికలు
- అసెంబ్లీలో సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే ఈ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే
- దీంతో రాష్ట్ర కోటాలోని 11 స్థానాలు వైఎస్సార్‌సీపీ పరం



సాక్షి, అమరావతి: రాజ్యసభలో తెలుగుదేశం పార్టీ అడ్రస్ వచ్చే మార్చి తర్వాత గల్లంతు కానుంది. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకూ అంటే గత 41 ఏళ్లలో రాజ్యసభలో ఆ పార్టీకి సభ్యులు లేకపోవడం ఇదే తొలిసారి అవుతుంది. నిజానికి.. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు ఆ పార్టీని చేజిక్కించుకున్న తర్వాత తెలుగుదేశం క్రమంగా ప్రాభవం కోల్పోతూ వస్తోంది. ఈ నేపథ్యంలో.. త్వరలో ఖాళీకానున్న మూడు రాజ్యసభ స్థానాలూ అసెంబ్లీలో సంఖ్యా బలం ద్వారా వైఎస్సార్‌సీపీనే కైవసం చేసుకుంటుంది. దీంతో రాజ్యసభలో టీడీపీ తొలిసారిగా కనుమరుగు కావడం ఖాయం.

రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 250 లోపు ఉండాలి. ప్రస్తుతమున్న సభ్యుల సంఖ్య 245. ఇందులో 233 మందిని ఆయా రాష్ట్రాల శాసనసభ్యులు ఎన్నుకుంటారు. మిగతా 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేస్తారు. రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యుల సంఖ్య 11. ఇక రాజ్యసభలో 2019 ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీకి ఇద్దరు.. టీడీపీకి 9 మంది సభ్యులు ఉండేవారు. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 50 శాతం ఓట్లతో 151 శాసనసభ స్థానాల్లో ఘనవిజయం సాధించగా.. టీడీపీ 23 స్థానాలకే పరిమితమై ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని మచ్చిక చేసుకుని కేసుల నుంచి బయటపడేందుకు టీడీపీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేశ్‌లను బీజేపీలోకి ఫిరాయించేలా చంద్రబాబు పావులు కదిపారు. ఇక రాష్ట్ర కోటాలో ఎన్నికైన రాజ్యసభ సభ్యుల్లో 2020లో నలుగురు (టీడీపీ), 2022లో నలుగురు (ముగ్గురు టీడీపీ, ఒకరు వైఎస్సార్‌సీపీ) పదవీకాలం పూర్తవడంతో ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించింది. నాడు అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలం ఆధారంగా ఎనిమిది రాజ్యసభ స్థానాలు ఆ పార్టీకే దక్కాయి. ఇందులో నలుగురు బీసీలను రాజ్యసభకు పంపి సామాజిక న్యాయమంటే ఇదీ అని సీఎం వైఎస్ జగన్ దేశానికి చాటిచెప్పారు.

ఆ మూడూ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే..

ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 2 నాటికి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వైఎస్సార్‌సీపీ), సీఎం రమేష్ (బీజేపీ), కనకమేడల రవీంద్రకుమార్ (టీడీపీ)ల పదవీకాలం పూర్తికానుంది. ఖాళీ అయ్యే ఈ మూడు స్థానాలకు ఫిబ్రవరి ఆఖరు లేదా మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీచేయనుంది. రాజ్యసభకు ఎన్నికకు కావాలంటే 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ప్రస్తుతం శాసనసభలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి చూస్తే.. ఈ మూడు స్థానాలు ఆ పార్టీ ఖాతాలో చేరడం ఖాయం. దీంతో రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ బలం 11కు చేరనుంది. అంటే రాష్ట్ర కోటాలో సీట్లన్నీ వైఎస్సార్‌సీపీ ఖాతాలోకే చేరుతాయి. టీడీపీ ఉనికే లేకుండాపోతుంది.

రేపు శ్రీవారి పార్వేట ఉత్సవం

తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. అదేరోజు గోదాపరిణయోత్సవం విశేషంగా జరుగనుంది. గోదాపరిణయోత్సవం సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు ఆండాళ్ అమ్మవారి మాలలను పెద్ద జీయ్యర్‌స్వామి మఠం నుంచి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకు వెళ్లి స్వామివారికి సమర్పిస్తారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీ మలయప్పస్వామివారు, శ్రీ కృష్ణస్వామివారు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ ఆస్థానం, పార్వేట కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారు ఆలయానికి చేరుకుంటారు. కాగా, పార్వేట ఉత్సవం కారణంగా ఈ నెల 16న శ్రీవారి ఆలయంలో నిర్వహించే అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఉత్కంఠ భరితంగా..

- కొనసాగుతున్న నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్
- తెలంగాణ పురుష, మహిళా జట్ల శుభారంభం
- ఉత్తరాఖండ్, బెంగాల్ జట్లపై గెలిచిన రాష్ట్ర జట్లు
- ఇండోర్ స్టేడియంలో క్రీడాకారుల సందడి



తెలంగాణ పురుష, మహిళా జట్లతో ఎన్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని క్రీడాశాఖ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 2వ ఫాస్ట్‌–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతోంది. రెండో రోజు ఆదివారం నిర్వహించాల్సిన మ్యాచ్‌లను నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎఫ్‌ఐ) సెక్రటరీ జనరల్ విజేందర్‌సింగ్, అంపైర్ బోర్డు చైర్మన్ అశోక్ ఆనంద్, టోర్నమెంట్ కమిటీ చైర్మన్ అమిత్ అరోరా, కన్వీనర్ ఆకాష్‌బత్ర ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఇండర్ స్టేడియంలోని రెండు కోర్టుల్లో మ్యాచ్‌లు నిర్వహించగా.. ఆయా రాష్ట్రాల పురుషుల, మహిళా జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. క్రీడాకారులతో ఇండోర్ స్టేడియం సందడిగా మారింది. ఆయా జట్లకు బీబీహెచ్‌ఎస్‌లో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐ ఉపాధ్యక్షుడు గిరిష్ సి.గౌడ, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సాదత్‌ఖాన్, కోశాధికారి సోహైల్‌ఖాన్, రామ్మోహన్‌గౌడ్, షకీల్, అక్రం పాల్గొన్నారు.

మహిళా విభాగంలో..

మహిళా విభాగం మ్యాచుల్లో తమిళనాడు జట్టు 25–18 గోల్స్ తేడాతో పుదుచ్చేరిపై, కర్ణాటక జట్టు 20–12 తేడాతో మహారాష్ట్రపై, బీహార్ జట్టు 29–11 గోల్స్ తేడాతో ఆంధ్రప్రదేశ్‌పై, ఢిల్లీ జట్టు 14–10 గోల్స్ తేడాతో రాజస్థాన్‌పై, హిమాచల్ ప్రదేశ్ జట్టు 22–16 గోల్స్ తేడాతో బీహార్‌పై, పంజాబ్ జట్టు 19–14 తేడాతో ఉత్తరప్రదేశ్‌పై, కేరళ జట్టు 31–5 గోల్స్ తేడాతో మధ్యప్రదేశ్‌పై, రాజస్థాన్ జట్టు 22–21 గోల్స్ తేడాతో తమిళనాడు జట్లపై విజయాలు నమోదు చేసుకున్నాయి.

టోర్నీలో చాంపియన్‌గా నిలుస్తాం..



మహబూబ్‌నగర్‌లో నేషనల్ నెట్‌బాల్ టోర్నీ నిర్వహించడం సంతోషంగా ఉంది. నేను ఇప్పటి వరకు 30కి పైగా జాతీయ, ఒకటి అంతర్జాతీయ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. సౌత్‌జోన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పురుషుల జట్టుకు కోచ్‌గా వ్యవహరించా. ఈ పోటీల్లో రాష్ట్రం విజేతగా నిలిచింది. నేషనల్ నెట్‌బాల్‌లో రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉన్నా. రాష్ట్ర జట్టు చాంపియన్‌గా నిలుస్తుందన్న నమ్మకం ఉంది.

– సయ్యద్ అంజద్‌అలీ, కెప్టెన్, తెలంగాణ పురుషుల జట్టు

మొదటి సారిగా ఫాస్ట్‌-5 ఇండోర్‌లో ఆడుతున్నాం..



నేను ఇప్పటి వరకు 16 సార్లు జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాను. ఫాస్ట్‌–5 నేషనల్ నెట్‌బాల్ టోర్నీకి తెలంగాణ రాష్ట్రం ఆతిథ్యం ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది. మొదటి సారిగా 2వ ఫాస్ట్‌–5 నేషనల్ నెట్‌బాల్ టోర్నీ ఇండోర్ స్టేడియంలో ఆడుతున్నాం. టోర్నీలో రాష్ట్ర మహిళా జట్టు ఆటతీరు బాగుంది. జట్టు సమిష్టి ప్రతిభతో టోర్నీలో విజేతగా నిలుస్తాం.

– గంగోత్రి మేఘన, కెప్టెన్, తెలంగాణ మహిళా జట్టు

తెలంగాణ జట్ల శుభారంభం..

నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పురుషులు, మహిళా జట్లు శుభారంభం చేశాయి. తొలి మ్యాచ్‌లో తెలంగాణ పురుషుల జట్టు 21–5 గోల్స్‌తో ఉత్తరాఖండ్ జట్టుపై విజయం సాధించింది. రాష్ట్ర మహిళా జట్టు 30–5 గోల్స్ తేడాతో వెస్ట్‌బెంగాల్ జట్టుపై గెలుపొందింది. రాష్ట్ర జట్లు సమిష్టిగా ఆడి మ్యాచ్‌లను గెలుపొందారు. పురుషుల విభాగం మ్యాచుల్లో కేరళ జట్టు 32–4 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టుపై, చండీఘడ్ జట్టు 25–22 గోల్స్ తేడాతో బీహార్ జట్టుపై, కర్ణాటక జట్టు 31–14 గోల్స్ తేడాతో మహారాష్ట్రపై, గోవా జట్టు 27–15 తేడాతో పుదుచ్చేరిపై, ఉత్తరప్రదేశ్ జట్టు 30–13 తేడాతో మధ్యప్రదేశ్‌పై, హర్యానా జట్టు 44–22 తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టుపై, జమ్ముకాశ్మీర్ జట్టు 24–10 తేడాతో తమిళనాడుపై, ఆంధ్రప్రదేశ్ జట్టు 28–14 గోల్స్ తేడాతో వెస్ట్‌బెంగాల్‌పై గెలుపొందాయి.



తలపడుతున్న తెలంగాణ, ఉత్తరాఖండ్ పురుషుల జట్లు

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్‌లో రన్నరప్‌గా ఉమ్మడి పాలమూరు



ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ క్రీడలు: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు ప్రతిభ కనబరిచాయి. ఈ టోర్నీలో జిల్లా జట్లు రన్నరప్‌గా నిలిచాయి. ఉమ్మడి జిల్లా జట్లను అండర్–19 ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాపిరెడ్డి, పీఈటీలు నాగరాజు, రాఘవేందర్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శ

భూత్పూర్/పెద్దకొత్తపల్లి: దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శివవర్ధన్‌రెడ్డి ఈ నెల 4న గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం స్వగ్రామమైన భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో నిర్వహించిన ఏకదశ దినకర్మకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ హాజరై శివవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతృమూర్తి ఆల వరలక్ష్మమ్మ, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ వెంట మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, సి.లక్ష్మారెడ్డి, పి.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ మాజీ చైర్మన్ రజని సాయిచంద్, మాజీ సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ఇబ్రహీం తదితరులు ఉన్నారు.



ఆల శివవర్ధన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

నిందితులను శిక్షించాలి..

పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త మల్లేష్‌ను గత నెలలో హత్య చేశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పరామర్శించి మల్లేష్ భార్య నిర్మలకు పార్టీ తరపున రూ.5 లక్షల చెక్కు అందజేశారు. పిల్లల చదువుకు పార్టీ ఆర్థిక సాయం అందజేస్తుందని వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. మల్లేష్‌ను కాంగ్రెస్‌పార్టీ నాయకులు హత్య చేయించారని.. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఘటనపై పోలీసులతో నిస్పక్షపాతంగా విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడుతూ హత్యా రాజకీయాలు చేయడం సరికాదన్నారు.



గంట్రావుపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

ప్రభోత్సవానికి ముస్తాబు

- నేడు భ్రమరాంబ ఆలయం నుంచి పార్వతీ, పరమేశ్వరుల ఊరేగింపు
- రేపు భోగమహేశ్వరంలో కల్యాణోత్సవం



అచ్చంపేటలో వెలసిన భ్రమరాంబదేవి

అచ్చంపేట: అచ్చంపేట లవేల్పుగా శ్రీభ్రమరాంబ(అంబగుడి)ఆలయం వెలుగొందుతుంది. చారిత్రక ప్రాధాన్యత ఉన్న ఈఆలయంలో ఏటా మకర సంక్రాతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ, భ్రమరాంబ మాత మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్, సీనియర్ విభాగంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నల్లమల కొండలపై వెలసిన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలకు అచ్చంపేట భ్రమరాంబ అలయం నుంచి ప్రభ ఉత్సవం తరలి వెళ్తుంది. సోమవారం రాత్రి ప్రభ ఉత్సవాన్ని ఉమామహేశ్వరం క్షేత్రానికి తీసుకెళ్లనున్నారు. అర్ధరాత్రి వరకు పట్టణంలో ఊరేగించి మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు భ్రమరాంబ దేవాలయం నుంచి పార్వతీదేవిని,ఉమామహేశ్వరం నుంచి శివుడిని కొంద దిగువన ఉన్న భోగమహేశ్వరంలోని మండపానికి తీసుకొచ్చి కల్యాణోత్సవం కన్నుల పండవగా నిర్వహిస్తారు.

గ్రామాల నుంచి వచ్చిన తర్వాత..

ఆదివారం సాయంత్రం ఆలయం నుంచి ప్రభ ఉత్సవాన్ని ప్రారంభించనున్నారు. నియోజకవర్గంలోని అచ్చంపేట, ఉప్పునుంతల, అమ్రాబాద్, లింగాల, మన్ననూర్, బల్మూర్, పదర నుంచి భ్రమరాంబ దేవిని లారీలు, వ్యాన్‌లపై అలంకరించి మంగళ వాయిద్యాలు, వీరభద్ర సేవ పురంతులతో ఊరేగింపుగా ప్రభను మహావైభవంగా తీసుకెళ్తారు. వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు.

హాజరు కానున్న ప్రజాప్రతినిధులు

భ్రమరాంబ ఆలయ ప్రభ ఉత్సవ కార్యక్రమానికి సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎంపీ రాములు హాజరవుతున్నారు. అదేవిధంగా బోగమహేశ్వరంలో జరిగే ఉమామహేశ్వర కల్యాణోత్సవంలో వీరందరూ పాల్గొంటారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,పుర ప్రముఖులు పాల్గొంటారు.



ప్రభోత్సవంకు ముస్తాబైన భ్రమరాంబ ఆలయం